www.prajasakti.com

ప్రజాశక్తి

మంగళవారం 10 జూన్ 2025

5

చిత్తూరు

'సేవ్ ట్రీ - సేవ్ ఎర్త్' సైకిల్ యాత్ర

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: సైకిల్ యాత్రికుడు కడపకు చెందిన కార్తీక్‌ను చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ అభినందించారు. "సేవ్ ట్రీ – సేవ్ ఎర్త్" నినాదంతో సైకిల్ యాత్ర చేస్తూ సోమవారం చిత్తూరుకు చేరుకున్న సైకిలిస్ట్ కార్తీక్‌ను అభినందించి ఆర్థిక సాయం అందించారు. పర్యావరణ పరిరక్షణ కోసం చేస్తున్న ఈ సైకిల్ యాత్ర విజయవంతం కావాలని ఆకాంక్షించారు. ప్రయాణంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

కార్తీక్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే

విద్యారంగంలో వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం

జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి రాంప్రసాద్ రెడ్డి

అవార్డుల పంపిణీ కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా ఇన్చార్జి మంత్రి రాంప్రసాద్ రెడ్డి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో విద్యారంగంలో వినూత్నమైన కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారని జిల్లా ఇన్చార్జి మంత్రి, రాష్ట్ర రవాణాశాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. సోమవారం చిత్తూరు పట్టణం నాగయ్య కళాక్షేత్రంలో జిల్లా విద్యాశాఖ, సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2024 - 2025 విద్యా సంవత్సరంలో నిర్వహించిన 10వ తరగతి అత్యధిక మార్కులు సాధించిన 190 మంది, ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలలో అత్యధిక మార్కులు సాధించిన 33 మంది విద్యార్థులకు చిత్తూరు జిల్లాకు చెందిన విద్యార్థులకు షైనింగ్ స్టార్స్ - 2025 అవార్డులు పంపిణీ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా ఇంచార్జి మంత్రి, ప్రభుత్వ విప్, గంగాధర నెల్లూరు ఎంఎల్ఏ డాక్టర్ వి.ఎం.థామస్, జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, చిత్తూరు, పూతలపట్టు ఎంఎల్ఏలు గురజాల జగన్ మోహన్, కె.మురళి మోహన్, నగర పాలక సంస్థ మేయర్ అముద, చుడా ఛైర్‌పర్సన్ కఠారి హేమలత, తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా జిల్లా ఇంచార్జ్ మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యాశాఖ ద్వారా చేపట్టిన వినూత్నమైన కార్యక్రమాలలో భాగంగా గత మూడు నెలల ముందు పేరెంట్ టీచర్ మీటింగ్‌ను విజయవంతంగా నిర్వహించి విద్యార్థి విద్యాప్రమాణాలపై ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పరస్పరం కలిసి చర్చించి విద్యార్థి ఉన్నతికి చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. 10వ తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం షైనింగ్ స్టార్ అవార్డ్స్ పేరుతో కార్యక్రమం ఏర్పాటు చేసి విద్యార్థుల అభ్యున్నతికి సహకరం అందిస్తున్నారన్నారు. షైనింగ్ స్టార్ కార్యక్రమం ప్రతి ఏడాది కొనసాగుతుందని, ఉన్నత మార్కులు సాధించిన విద్యార్థులకు రూ.20వేలు నగదు బహుమతితో పాటు మెడల్స్, మొమెంటోలు అందించడం జరుగుతుందన్నారు.

విద్యార్థులు విద్యతో పాటు మంచి లక్షణాలను అలవరచుకోవాలని, రక్తదానం చేస్తే ప్రాణదానం చేసినట్లేనని, రక్తదానం చేయడానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. నాగరిక ప్రపంచంలో సోషల్ మీడియా ఉచ్చులో చిక్కుకుపోయామని, డ్రగ్స్ మహమ్మారి కాటేస్తున్నదన్నారు. విద్యాలోకం చెడు వ్యసనాలకు బానిసలు కాకూడదన్నారు. ప్రభుత్వ విప్, జిడి నెల్లూరు ఎంఎల్ఏ మాట్లాడుతూ షైనింగ్ స్టార్ అవార్డులు పొందిన విద్యార్థులు వారి తల్లిదండ్రులను అభినందించారు. జిడి నెల్లూరు నియోజకవర్గం నుండి 40 మంది విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించారని, వీరికి రాష్ట్ర ప్రభుత్వం తరపున ఒక్కొక్కరికీ రూ.20 వేలు చొప్పున నగదు బహుమతి అందించడం జరుగుతుందని తెలిపారు. మంత్రి నారా లోకేష్ ఎస్ ఆర్ పురంలో మహిళా డిగ్రీ కళాశాల మంజూరు చేశారని, త్వరలో పూర్తి అవుతుందని తెలిపారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 10వ తరగతి తరువాత విద్యార్థులు రాష్ట్ర, దేశ స్థాయిలో పోటీని ఎదుర్కోవలసి ఉంటుందని, తల్లిదండ్రుల మాటలు విని క్రమశిక్షణ, పట్టుదల, సమాజ విలువలను పాటిస్తూ ముందుకు వెళితే అనుకున్న లక్ష్యాలను సాధించవచ్చని విద్యార్థులకు సూచించారు. చిత్తూరు ఎంఎల్ఏ మాట్లాడుతూ చిత్తూరు నియోజకవర్గంలో ఒక ప్రభుత్వ పాఠశాలను దత్తత తీసుకుని ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామన్నారు. ఎన్‌డిఏ కూటమి ప్రభుత్వం విద్యారంగంలో సమూల మార్పులు తీసుకు వచ్చిందన్నారు. చిత్తూరు పట్టణానికి త్వరలో ఒక విశ్వవిద్యాలయంను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసే అవకాశం ఉందని, పిసిఆర్ కళాశాల వద్ద స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. పూతలపట్టు ఎంఎల్ఏ మాట్లాడుతూ ప్రభుత్వ బడులు, కళాశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు ప్రైవేట్ కళాశాల విద్యార్థులకు ధీటుగా ఉత్తమ మార్కులు సాధించారని, ఇది రాష్ట్ర ప్రభుత్వం కృషి ఫలితంగా సాధ్యమైందన్నారు. జిల్లాలో ఉత్తమైన మార్కులు సాధించిన విద్యార్థులను అభినందించారు. మాజీ ఎమ్మెల్సీ రాజ సింహులు (దొరబాబు), చిత్తూరు మాజీ ఎమ్మెల్యే సికె.జయచంద్రరెడ్డి (సికె.బాబు) డీఈవో వరలక్ష్మి, సమగ్రశిక్ష పిఓ.వెంకటరమణ, నాయకులు విఆర్.రాజన్, కాజూరి బాలాజీ, షణ్ముగం, విద్యార్థులు వారి తల్లి దండ్రులు పాల్గొన్నారు.

వెబ్ కౌన్సెలింగ్ రద్దు చేయాలి

బదిలీలు ప్రత్యక్ష పద్ధతిలో జరపాలని ఉపాధ్యాయుల నిరాహార దీక్ష



చిత్తూరు ఎన్‌జీవో హోం వద్ద నిరాహార దీక్ష చేస్తున్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న ఉపాధ్యాయుల బదిలీలలో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుల బదిలీలను ఆన్లైన్లో కాకుండా ప్రత్యక్ష పద్ధతులో జరపాలని రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధ్యాయులు నిరాహార దీక్ష చేపట్టారు. స్థానిక ఎన్జీవో హోంలో ఏర్పాటు చేసిన దీక్షా శిబిరంలో ఉపాధ్యాయులు పెద్దఎత్తున నిరాహార దీక్ష చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదికకు ఇచ్చిన హామీ మేరకు సెకండ్ గ్రేట్ టీచర్ల బదిలీలను ప్రత్యక్ష పద్ధతిలోనే నిర్వహించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఆన్లైన్లో బదిలీలు జరపడాన్ని నిరసిస్తూ ఆదివారం ఆయా జిల్లా కేంద్రాలలో పెద్ద మొత్తంలో నిరసన ధర్నాను నిర్వహించారు. అయినప్పటికీ ప్రభుత్వంలో చలనం లేకపోవడంతో సోమవారం నిరాహార దీక్షకు కూర్చున్నారు. ఉపాధ్యాయ సంఘాల నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీలకు భిన్నంగా ఆన్లైన్ పద్ధతిలో బదిలీలు జరపడం దారుణమన్నారు. గత రెండు, మూడు, దఫాలలో జరిగిన ఆన్లైన్ బదిలీలలో పెద్దమొత్తంలో ఇబ్బందులు ఎదురయ్యాయని, అనేకమందికి వారి అవకాశాల కంటే కష్టతరమైన ప్రాంతాలు కేటాయించబడ్డాయని, దానిని నివారించడం కోసం ఉపాధ్యాయ సంఘాలు ఐక్యవేదికగా ఏర్పడి ప్రత్యక్ష పద్ధతిలో బదిలీలను కోరుకోవడం జరిగిందని తెలిపారు. ఉపాధ్యాయ సంఘాల సమావేశంలో ప్రభుత్వం ప్రత్యక్ష పద్ధతిలో బదిలీ చేరడానికి అంగీకరిస్తూనే, మరోపక్క ఆన్లైన్లోనే బదిలీలు జరపడానికి ఉత్తర్వులు ఇచ్చిందని, దీనిని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం ఇప్పటికైనా తన పద్ధతి మార్చుకొని ఉపాధ్యాయులు కోరుకున్న విధంగా ప్రత్యక్ష పద్ధతిలో బదిలీలు నిర్వహించాలని, లేనిపక్షంలో మంగళవారం విజయవాడ మంగళగిరిలోని విద్యాశాఖ కార్యాలయాన్ని ముట్టడిస్తామని నాయకులు అల్టిమేట్ ఇచ్చారు. నాయకులు జీవి.రమణ, ఎస్ఎస్.నాయుడు, ఎం.సోమశేఖర్ నాయుడు, ఎన్.మణిగండన్, ఎన్ఆర్.మదన్మోహన్ రెడ్డి, ముక్తార్ అహ్మద్, స్వామి కన్నన్, విజయ భాస్కర్‌రెడ్డి, మంజునాథ గుప్తా, నాగరాజా, విజయ్ కుమార్, గోవిందస్వామి, సుధాకర్ రెడ్డెప్ప నాయుడు, రెహానా బేగం, మోహన్ బాబు, ఎస్పీ బాషా, యువరాజు, చంద్రన్, పార్థసారథి, రమణారెడ్డి, ప్రతాపరెడ్డి, దేవరాజులు, సరిత, నరసింహ, వెంకటేష్, సురేష్ బాబు పాల్గొన్నారు. నిరాహార దీక్ష శిబిరంలో గంటా మోహన్, చెంగల్రాయ మందడి తదితరులు పాల్గొని నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింప చేశారు.

ప్రొసీడింగ్స్ ప్రకారం మామిడి ధర అమలు చేయాలి

కలెక్టరేట్ ఎదుట మామిడి రైతుల సంక్షేమ సంఘం నాయకుల నిరసన



కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న రైతు సంఘాల నాయకులు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: మామిడి రైతులకు కలెక్టర్ ఇచ్చిన ప్రొసీడింగ్ ప్రకారం ధరలు అమలు చేసి, పరిశ్రమల వెంటనే ప్రారంభించాలని సోమవారం కలెక్టరేట్ వద్ద మామిడి రైతుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేయడం జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ జిల్లాలో మామిడి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు ప్రధానంగా తోతాపురి మామిడి ధర నిర్ణయించడంలో కలెక్టర్ రూ.12లు నిర్ణయించడం జరిగిందని, కానీ కలెక్టర్ ఆదేశాలను యాజమాన్యాలు ఏమాత్రం ఖాతరు చేయడం లేదని ఆరోపించారు. మామిడి కాయలు పక్వానికి వచ్చి రాలిపోతున్న సందర్భంగా రైతులు నష్టపోతున్నారని తెలిపారు. ఉద్దేశపూర్వకంగానే మామిడి గుజ్జు యాజమాన్యాలు పరిశ్రమలు ప్రారంభించకుండా సరుకు తీసుకోవడం లేదని, వెంటనే పరిశ్రమలను ప్రారంభించి సరుకు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అధికార యంత్రాంగం చొరవ చూపి పరిశ్రమలను ప్రారంభించే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. ప్రభుత్వం నిర్ణయించిన రేటును కూడా యాజమాన్యాలు లెక్క చేయడం లేదంటే అలాంటి పరిశ్రమలపై ఎందుకు చర్యలు చేపట్టడం లేదో అనుమానాలు వ్యక్తం అవుతున్నాయని, ఇప్పటికైనా కలెక్టర్ వెంటేనే స్పందించి పరిశ్రమలను ప్రారంభించి రైతులు పంటను తరలించాలని తెలిపారు.

ధరను అమలు చేయిస్తాం: జాయింట్ కలెక్టర్ హామీ

మామిడి రైతుల సమస్యలపై నిరసన అనంతరం మామిడి సంక్షేమ సంఘం నాయకులు జాయింట్ కలెక్టర్ విద్యాధరిని కలిసి వినతిపత్రం ఇవ్వడం జరిగింది. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన ప్రొసీడింగ్స్‌ను వెంటనే అందిస్తామని దాని ప్రకారం ధరను అమలు చేసే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. పరిశ్రమలు కూడా వెంటనే ప్రారంభిస్తామని వీటి కోసం టీములు ఏర్పాటు చేశామని నిరంతరం నిఘా పెడతామని తెలిపారు. నాయకులు సైతం తమకు సమాచారం ఇస్తూ ఉండాలని తెలిపారు. జనార్ధన్, వాడ గంగరాజు, హరిబాబు నాయుడు, శంకరన్, మునిరత్నం నాయుడు, ఉమాపతి నాయుడు, నాగరాజు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు పూర్వవైభవం తెస్తా..

కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకువస్తానని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైయస్ షర్మిల తెలిపారు. సోమవారం చిత్తూరు నగరంలోని బ్యాన్స్ హోటల్‌లోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన జిల్లా విస్తృతస్థాయి సమావేశంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైయస్ షర్మిల ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీని రాష్ట్ర వ్యాప్తంగా పటిష్టపరిచి రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారాన్ని చేపట్టేలా కృషి చేస్తానని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై ప్రజలను పోరాటాలకు సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. ఈ మేరకు రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో సమావేశాలు నిర్వహించి నాయకులను కార్యకర్తలను సంసిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పోటుగారి భాస్కర్, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్ షర్మిల

ప్రతి సమస్యనూ పరిష్కరించాలి : కమిషనర్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరపాలక కార్యాలయంలో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పీజీ ఆర్ఎస్) కార్యక్రమంలో తొమ్మిది వినతులు అందినట్లు నగర కమిషనర్ పి.నరసింహ ప్రసాద్ తెలిపారు. సోమవారం నగరపాలక కార్యాలయంలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుంచి కమిషనర్ నేరుగా వినతులు, ఫిర్యాదులు స్వీకరించారు. ప్రజల నుంచి అందిన ఫిర్యాదులపై అక్కడికక్కడే సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకున్నారు. అర్జీలపై సంబంధిత అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన చేసి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. సోమవారం నాటి కార్యక్రమంలో ఫించన్లు 3, ఇంజనీరింగ్ 2, రెవెన్యూ 2, టౌన్ ప్లానింగ్ 2 చొప్పున మొత్తం 9 ఫిర్యాదుల అందినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంహెచ్వో డాక్టర్ లోకేష్, ఎంఈ వెంకట రామిరెడ్డి పాల్గొన్నారు.

ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న నగర కమిషనర్

ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న జాయింట్ కలెక్టర్

పిజిఆర్ఎస్‌కు 235 అర్జీలు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ప్రజాసమస్యల పరిష్కార వేదికలో భాగంగా జిల్లా సచివాలయంలోని గ్రీవెన్స్ హాల్‌లో సోమవారం జిల్లా జాయింట్ కలెక్టర్ జి. విద్యాధరి ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్‌తో పాటు డిఆర్ఓ కె.మోహన్ కుమార్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అనుపమ, విజయలక్ష్మి, చిత్తూరు ఆర్డిఓ శ్రీనివాసులు ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. మొత్తంగా 235 అర్జీలు అందగా అందులో శాఖల వారీగా వివరాలు ఇలా ఉన్నాయి. రెవెన్యూ, సర్వేశాఖకు 175, పోలీసుశాఖ 15, పంచాయతీరాజ్ 3, డిఆర్‌డిఏ 25, విద్యుత్ శాఖ 1, డిస్టిక్ రిజిస్టర్ 3, డీఎస్ఓ 5, పశుసంవర్ధక శాఖ 1, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ 1, డిఎంఅండ్ హెచ్ఓ 1, రూరల్ డెవలప్మెంట్ 1, డిసిసి బ్యాంక్ 1, ఇరిగేషన్ 1, ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ 1, ఆర్ అండ్‌బి శాఖ 1 అర్జీలు అందాయి. కార్యక్రమంలో వివిధ శాఖలకు సంబంధించిన అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రద్దు చేసిన వర్కింగ్ జర్నలిస్ట్ చట్టాన్ని పునరుద్ధరించాలి: ఏపీడబ్ల్యూజేఎఫ్

గాంధీ విగ్రహం ఎదుట ధర్నా చేస్తున్న జర్నలిస్టులు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిన వర్కింగ్ జర్నలిస్ట్ యాక్ట్ 1955 వేతన సవరణ చట్టం 1958ను వెంటనే పునరుద్ధరించాలని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ఏపీడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం జర్నలిస్టులు చిత్తూరు గాంధీ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు అన్ని ప్రజాసంఘాలు కార్మిక సంఘాలు, ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాలు మద్దతు తెలిపాయి. ఈ సందర్భంగా ఏపీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర నాయకులు కవరకుంట్ల జయరాజ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రద్దుచేసిన 44 కార్మిక చట్టాలలో జర్నలిస్టులకు సంబంధించిన రెండు చట్టాలు ఉన్నాయని తెలిపారు. అన్ని విభాగాల్లోని జర్నలిస్టులను ఒకే గొడుగు కింద తెచ్చే విధంగా వర్కింగ్ జనరేట్ చట్టాన్ని అమలు చేయాలని జర్నలిస్టులు డిమాండ్ చేస్తుంటే ఆ చట్టాన్ని పూర్తిగా రద్దు చేయడం శోచనీయమన్నారు. వేతనాలకు సంబంధించిన 1958 వేతన సవరణ చట్టాన్ని కూడా రద్దు చేయడం జర్నలిస్టులకు కనీస వేతన సౌకర్యం కల్పించకుండా పోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య పరిరక్షణలో జర్నలిస్టులు కీలక భూమిక పోషిస్తున్న నేపథ్యంలో వారిని పరిరక్షించాల్సిన ప్రభుత్వాలు వారి కడుపు కొట్టే విధంగా చట్టాలను రద్దు చేయడం దారుణమన్నారు. మీడియా కమిషన్ ఏర్పాటు జర్నలిస్టులకు పెన్షన్ సౌకర్యం కోసం ప్రత్యేక చట్టాలను రూపొందించాల్సిన ప్రభుత్వాలు వాటిని తుంగలో తొక్కి నల్ల చట్టాలను తీసుకొస్తున్నారని ఆరోపించారు. జర్నలిస్టుల రక్షణ కొరకు ప్రత్యేకరక్షణ చట్టాన్ని తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఐక్య ఉద్యమాలతో జర్నలిస్టుల హక్కులను పరిరక్షించేందుకు ఏపీడబ్ల్యూజేఎఫ్ కృషి చేస్తుందని తెలిపారు. ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షుడు బి.ప్రకాష్ మాట్లాడుతూ జర్నలిస్టులకు అపారం నష్టం కలిగించే వర్కింగ్ జర్నలిస్ట్ చట్టం వేతన సవరణ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం రద్దు చేయడం శోచనీయమని, రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని బలోపేతం చేస్తామని వివరించారు. జూలై 9న జరిగే సార్వత్రిక సమ్మెలో జర్నలిస్టులు పాల్గొంటారని తెలిపారు. జర్నలిస్టులకు మద్దతుగా సిఐటియు నాయకులు వాడ గంగరాజు, ఏఐటియుసి నాయకులు నాగరాజు, ఎస్టియు రాష్ట్ర నాయకులు గంటా మోహన్, యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు రమణ తదితరులు ప్రసంగించారు. అధిక సంఖ్యలో జర్నలిస్టులు పాల్గొన్నారు.

'యోగా'తో దేశ ప్రతిష్ట విశ్వ వ్యాప్తం: ఇన్‌ఛార్జి మంత్రి

జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మంత్రి, కలెక్టర్, యోగాసనాలు వేస్తున్న ప్రజలు అధికారులు

ప్రజాశక్తి- చౌడేపల్లి: రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచనల మేరకు రాష్ట్రంలో మే 21 నుండి జూన్ 21 వరకు యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించడం జరుగుతున్నదని, ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా ఇన్చార్జి మంత్రి, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం చౌడేపల్లి మండలం బోయకొండ దేవస్థానం వద్ద యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా యోగా అభ్యసన అవగాహన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, ఎస్పి మణికంఠ చందోలుతో కలసి జిల్లా ఇన్చార్జి మంత్రి పాల్గొన్నారు. జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభం కాగా యోగా గురువు బాబు యోగా విశిష్టతను వివరిస్తూ వివిధ ఆసనాలను వేసే పద్ధతిని నేర్పారు. మంత్రి మాట్లాడుతూ భారతీయ శాస్త్ర సంపద ప్రపంచానికి దిక్సూచిగా యోగాను అందించారన్నారు. భారత దేశం అందించిన యోగా నేడు విశ్వవ్యాపితం అయిందన్నారు. మే 21 ప్రారంభించిన ఈ కార్యక్రమం దిగ్విజయంగా కొనసాగుతున్నదన్నారు. జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు మే 21 నుండి ఒక నెల రోజుల పాటు జిల్లాలో గ్రామ స్థాయి నుండి జిల్లా స్థాయి వరకు యోగా అవగాహన కార్యక్రమాలు చేపట్టామన్నారు. యోగా చేయడం ద్వారా శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఒత్తిడిని జయించ గలుగుతారన్నారు. మానసిక ఒత్తిడి తగ్గితే ప్రజలు తమ దైనందిన జీవితాన్ని ఆరోగ్యంగా ఉత్సాహంగా గడపవచ్చన్నారు. క్రమంగా యోగా చేస్తే బిపి, షుగర్ లాంటి వ్యాధులను కూడా అదుపులో ఉంచుకోవచ్చారు. జిల్లాలో 5 వేల మంది మాస్టర్ ట్రైనర్లను ఏర్పాటు చేసి యోగా అవగాహన కార్యక్రమం చేపట్టామని, గ్రామస్థాయిలో ప్రతి సచివాలయ పరిధిలో కనీసం 7 కార్యక్రమాలు చేపట్టేలా కార్యాచరణ రూపొందించామన్నారు. కార్యక్రమంలో జిల్లా పర్యటక శాఖ అధికారి గౌరీ, డిఆర్డిఏ పీడీ శ్రీదేవి, డిఎస్డిఓ బాలాజీ, పలమనేరు ఆర్డిఓ భవాని, బోయకొండ గంగమ్మ దేవస్థానం ఈఓ ఏకాంబరం, చౌడేపల్లి తహశీల్దార్ హనుమంతు నాయక్, ఎంపీడిఓ లీలా మాధవి పాల్గొన్నారు.

కుప్పం రూరల్ : సంపూర్ణ ఆరోగ్యం యోగాతో సాధ్యమని తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చెక్కునత్తం మణి తెలిపారు. సోమవారం చెక్కునత్తం గ్రామంలో స్థానిక యూనిట్ ఇంచార్జ్ కనకరాజు ఆధ్వర్యంలో జరిగిన యోగ మాసోక్షవాలకు హాజరయ్యారు. గ్రామస్తులకు యోగ పై అవగాహన కల్పిస్తూ పంచాయతీ పరిధిలో ర్యాలీ నిర్వహించారు. పార్టీ అధ్యక్షులు బీరప్ప, మునిరత్నం, పంచాయతీ కార్యదర్శి, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

చిత్తూరు అర్బన్: నిత్యం యోగా చేయడం వలన ఆరోగ్యాన్ని పెంపొందించుకోవాలని మేయర్ ఎస్.అముద పిలుపునిచ్చారు. యోగాంధ్ర-2025 కార్యక్రమంలో భాగంగా సోమవారం చిత్తూరు నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని వార్డు సచివాలయాల్లో అవగాహన ర్యాలీలు నిర్వహించారు. 39వ వార్డు సచివాలయ పరిధిలో జరిగిన ర్యాలీ కార్యక్రమంలో మేయర్ ఎస్.అముద, కమిషనర్ పి.నరసింహప్రసాద్, ఎంహెచ్ఓ డాక్టర్ లోకేష్, సీఎంఎం వెంకటరమణ, శానిటరీ ఇన్స్పెక్టర్ లోకనాథం, వార్డు కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

పలమనేరు: 11 అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకల సందర్భంగా కమిషనర్ ఎన్‌వి రమణారెడ్డి ఆధ్వర్యంలో సోమవారం ఉదయం పలమనేరు మున్సిపల్ కార్యాలయం నుండి పురవీధుల్లో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ కూడలి వద్ద యోగాంధ్ర ప్రతిజ్ఞ చేశారు. ఎంపీడీవో భాస్కర్, ఎంఈవో బాలసుందరం, సచివాల సిబ్బంది పాల్గొన్నారు.

వెదురుకుప్పం: మండల కేంద్రంలో ఎంపీడీఓ పురుషోత్తం ఆధ్వర్యంలో యోగాంధ్ర మండల స్థాయి భారీ అవగాహనా ర్యాలీ కార్యక్రమం నిర్వహించారు. యోగాతో ఆరోగ్యంగా ఉండవచ్చు అని, ఒత్తిడిని తగ్గించుకోవచ్చు అని అవగాహన కల్పించారు. తహశీల్దార్ బాబు, ఎంఈవో, మండల వ్యవసాయ అధికారి, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ, ఏపిఎం, ఏపిఓ పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లి: సోమవారం యోగాంధ్రలో భాగంగా స్థానిక మండల సచివాలయం నుండి నాలుగు రోడ్ల కూడలి చెక్పోస్ట్ వరకు యోగాంధ్ర ర్యాలీ, మానవహారాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి రాజేంద్ర బాలాజీ పాల్గొని ప్రతి ఒక్కరూ యోగా సాధన చేయాలని తెలిపారు. పంచాయతీ సెక్రెటరీ సదాశివ, దేవేంద్ర, అమర్నాథ్, సుల్తానా, శశి కుమార్, అజ్మత్ అలీ, ఆనందాచారి పాల్గొన్నారు.

కుప్పం ఎయిర్‌పోర్టుకు

భూములు బలవంతంగా లాక్కోవద్దు

అధికారులను అడ్డుకున్న రైతులు

ప్రజాశక్తి- చిత్తూరు డెస్క్

కుప్పం ఎయిర్ పోర్టుకు తమ భూములను బలవంతంగా లాక్కోవద్దు అని దండికుప్పం గ్రామస్తులు, రైతులు అధికారులను అడ్డుకున్నారు. సోమవారం దండికుప్పంలో గ్రామసభలకు డిప్యూటి కలెక్టర్, తహశీల్దార్‌ను అడ్డగించి తమ భూములను ఎయిర్‌పోర్టుకు ఇచ్చేది లేదని రైతులు ఏకగ్రీవంగా తీర్మానించి చెప్పారు. తమ భూముల్లోకి అడుగు పెట్టవద్దని తేల్చి చెప్పారు. రామకుప్పం, శాంతిపురం మండలాల్లోని 9 పంచాయతీలకు చెందిన రైతులు, వ్యవసాయ కూలీలతో డిప్యూట కలెక్టర్, తహశీల్దార్ దాదాపు రెండు గంటల సమయం చర్చలు జరిపారు. కానీ రైతులు భూములు ఇవ్వడానికి అంగీకరించ లేదు. ఏడాదికి రెండు, మూడు పండే సారవంతమైన భూములను ఎయిర్‌పోర్టు ఇవ్వడం కుదరదని తేచ్చి చెబుతున్నా భూములను ఎలా బలవంతంగా లాక్కొంటారని నిలదీశారు. 2013 భూసేకరణ చట్టం అమలు చేయకుండా వ్యవహరిస్తున్న అధికారులపై ప్రభుత్వ చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం భూములు ఎయిర్‌పోర్టుకు ఇచ్చేది లేదని, సర్వేల పేరుతో తమని ఇబ్బంది పెట్టవద్దు అని రైతులు, గ్రామస్తులు రాతపూర్వకంగా రాసి అధికారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఓబుల్ రాజు, జిల్లా ఉపాధ్యక్షులు అమర్ నారాయణ, రైతులు చక్రపాణి, విజయ్ కుమార్, లక్ష్మీ, గౌరమ్మ, రాజన్న, జయప్ప, సుబ్రహ్మణ్యం, మురగేష్, అర్జున్ పాల్గొన్నారు.

'సమత' విద్యార్థులకు షైనింగ్ స్టార్స్ అవార్డులు

ప్రజాశక్తి- ఐరాల: జిల్లా స్థాయిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు చిత్తూరు నాగయ్య కళాక్షేత్రంలో సోమవారం రాష్ట్ర ప్రభుత్వం అందించే షైనింగ్ స్టార్ అవార్డులు ఐరాల మండలం సమత ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో చదివిన విద్యార్థులు కె.రోహిత్ 589, కె.రోషిత 553, కె.జోషిక 546 మార్కులు సాధించినందుకు కలెక్టర్ సుమిత్ కుమార్ చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను స్కూల్ కరస్పాండెంట్ సురేంద్రరెడ్డి అభినందించారు.

'అక్షర' విద్యార్థికి ప్రతిభ అవార్డు

ప్రజాశక్తి- విజయపురం (నగరి): పట్టణ పరిధి నాగలాపురం రోడ్డులోని అక్షర పాఠశాలకు చెందిన విద్యార్థి కె.వనితకు షైనింగ్ స్టార్ ప్రతిభ అవార్డు దక్కింది. పదవ తరగతి ఫలితాల్లో 566 మార్కులు సాధించినందుకుగాను జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ చేతులమీదుగా అవార్డును అందుకుంది. విద్యార్థిని పాఠశాల కరస్పాండెంట్ లతామురళి, ప్రిన్సిపాల్ ముగిలన్ అభినందించారు.

ఏపీఆర్ఎస్ విద్యార్థినులకు అవార్డులు

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: మండలంలోని కమ్మనపల్లి పంచాయతీ పరిధిలో ఉన్న ఏపీ ఆర్ఎస్ స్కూల్ విద్యార్థినులు పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ సాధించి మండలంలో మొదటి స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా సోమవారం జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ చేతుల మీదుగా షైనింగ్ స్టార్స్ అవార్డులను అందుకున్నారు. వీరిలో వి.మంజుల 590, ఎం.చందు 590, జి.లక్ష్మీ ప్రణతి 589, పి.దేవ నందిని 588, సి.అనూష 588, ఎం.దీక్షిత 573, జి.గంగోత్రి 502 మార్కులు సాధించి అవార్డుతోపాటు రూ.20వేలు నగదు బహుమతి పొందారు. అవార్డులు పొందిన విద్యార్థులను స్కూల్ ప్రిన్సిపాల్ శోభ, ఉపాధ్యాయులు అభినందించారు.

షైనింగ్ స్టార్స్‌గా కుప్పం విద్యార్థినులు

ప్రజాశక్తి- కుప్పం టౌన్: కుప్పం ప్రభుత్వ వృత్తివిద్యా జూనియర్ కళాశాల విద్యార్థినులు షైనింగ్ స్టార్స్ అవార్డును సొంతం చేసుకోవడం కళాశాలకే గర్వకారణమని ప్రిన్సిపల్ తెలిపారు. తమ కళాశాలలో ఓప గ్రూపులో ఇంటర్మీడియట్ పూర్తి చేసి, రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రతిభను కనబరిచిన లలిత కుమారి, సుస్మితలు జిల్లా ఇన్చార్జి మంత్రి రాంప్రసాద్ రెడ్డి, జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్‌ల చేతుల మీదగా షైనింగ్ స్టార్స్ అవార్డులతో పాటు రూ.20వేల రూపాయల నగదు పురస్కారాన్ని పొందడం గర్వకారనమని కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపకులు విద్యార్థులను అభినందించారు.

అనుబంధ సంస్థల కమిటీలు ఏకగ్రీవం

ప్రజాశక్తి- కుప్పం రూరల్: ఎమ్మార్పీఎస్ అనుబంధ సంస్థల కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు నియోజకవర్గ ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు రాజకుమార్ తెలిపారు. కుప్పం పట్టణం డీకేపల్లి మాదిగ వాడలో ఎమ్మార్పీఎస్ అనుబంధ సంస్థలు ఎం.ఎస్.పి, మాదిగ యువసేన, మాదిగ విద్యార్థి విభాగం కమిటీలను ఎన్నుకున్నట్టు తెలిపారు. జిల్లా ఇన్చార్జి ధనరాజపల్లి కిషోర్ మాదిగ, జిల్లా అధ్యక్షులు ప్రకాష్ మాదిగ సూచనలతో కుప్పం మండల ఎంఆర్పిఎస్ అధ్యక్షులు మురుగేష్ ఆధ్వర్యంలో కమిటీల నియామకం జరిగిందన్నారు. ఎంమ్మెస్పి అధ్యక్షులుగా గురుమూర్తి, ఉపాధ్యక్షులుగా రామప్ప, ఎమ్మార్పీఎస్ అధ్యక్షులుగా పళణి మాదిగ, ఉపాధ్యక్షులుగా మురుగేష్, మాదిగ యువసేన అధ్యక్షులుగా చిరంజీవి మాదిగ, యువసేన ఉపాధ్యక్షులుగా శరన్, మాదిగ విద్యార్థి విభాగం అధ్యక్షులుగా భాస్కర్, ఉపాధ్యక్షులుగా రామును ఎన్నుకోవడం జరిగిందన్నారు. జూలై 7వ తేదీన జరగబోవు ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని పెద్ద ఎత్తున నిర్వహించాలని పిలుపునిచ్చారు.

టీబీ లక్షణాలుంటే గళ్ల పరీక్ష తప్పనిసరి

ప్రజాశక్తి- విజయపురం (నగరి): టీబీ లక్షణాలుంటే గళ్లపరీక్ష చేసుకోవాలని మెడికల్ మొబైల్ యూనిట్ డాక్టర్ కీర్తిప్రియ అన్నారు. టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం ఎం.కొత్తూరులో టీబీపై ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బలహీనమైన జనాభా అయిన 60 సంవత్సరాల వయస్సుకు పైబడినవారు, బిఎమ్ఐ, డయాబెటిక్, స్మోకర్, ఆల్కహాల్, 5 ఇయర్స్ టీబీ కేసులు, 2 ఇయర్స్ టీబీ కాంట్రాక్టు, మైనింగ్, స్టోన్ క్రాసింగ్, ఫ్యాక్టరీ వర్కర్స్, హాస్టల్ స్టూడెంట్స్ ప్రతి ఒక్కరు స్రీనింగ్ టెస్ట్ చేసుకోవాలని సూచించారు. టీబీ లక్షణాలు ఉంటే గళ్ల పరీక్షకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రావాలన్నారు. టీబీ లక్షణాలు లేకున్నా దగ్గు వస్తూవుంటే నగరి హాస్పిటల్‌లో చెస్ట్ ఎక్సరే తీసి పరీక్షలు చేసుకోవాలన్నారు. సచివాలయం పరిధిలో టీబీ ఆన్ ట్రీట్మెంట్ కేసులుంటే ఫుడ్ న్యూట్రిషన్ కిట్స్ అందించడానికి దాతలు ముందుకు రావాలన్నారు. సచివాలయ సిబ్బంది, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మోడల్ పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా వెంకమరాజు

ప్రజాశక్తి- విజయపురం (నగరి): విజయపురం మండలం శ్రీహరిపురం మోడల్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా దొమ్మరాజు వెంకమరాజు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. మోడల్ ప్రాథమిక పాఠశాల అన్ని రంగాలలో అభివృద్ధి చేసి విద్యార్థులలో శాస్త్రీయ దృక్పదాన్ని పెంపొందించుటకు కృషి చేస్తానని రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహిత వెంకమరాజు పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో విశ్రాంత విద్యాశాఖ అధికారి జయదేవరాజు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ భవానీ, గ్రామపెద్దలు ఎరుకలయ్య, సురేష్, జయరాం, జ్యోతిలక్ష్మి చెంచురాజు, మురళి పాల్గొన్నారు.

రిజిస్టర్ చేసుకున్న రైతులకు మాత్రమే ప్రోత్సాహం

తోతాపురి మామిడి మద్దతు ధరకు సంబంధించిన బోర్డును ప్రదర్శించాలి: కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం తోతాపురి మామిడికి మద్దతు ధర ప్రకటించిన నేపథ్యంలో దీన్ని పూర్తిస్థాయిలో రైతులకు న్యాయం జరిగేలా ప్రాసెసింగ్ కంపెనీల వద్ద పర్యవేక్షణను నియామకం అయిన వారు బాధ్యతాయుతంగా చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం జిల్లా సచివాలయంలోని సమావేశపు మందిరంలో జిల్లా కలెక్టర్, జిల్లా జాయింట్ కలెక్టర్ జి విద్యాధరి, డిఆర్ఓ కే.మోహన్ కుమార్, జిల్లా ఉద్యానశాఖ అధికారి మధుసూదన్ రెడ్డిలతో కలిసి తోతాపురి మామిడికి మద్దతు ధర రైతులకు అందేలా ప్రాసెసింగ్ కంపెనీల వద్ద విధులకు కేటాయింపబడ్డ వివిధ శాఖలకు చెందిన అధికారులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. తోతాపురి మామిడి రైతులకు ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించడం దాన్ని పూర్తిస్థాయిలో రైతులకు న్యాయం జరిగేలా జిల్లా యంత్రాంగం అందుకు అవసరమైన అన్ని చర్యలు చేపడుతుందన్నారు. ప్రధానంగా ప్రాసెసింగ్ కంపెనీల వద్ద మామిడి సరఫరా చేసే విషయంలో ఇతర రాష్ట్రాల నుండి తోతాపురి మామిడి రకాన్ని పూర్తిగా రాకుండా చర్యలు చేపట్టాలన్నారు. ప్రాసెసింగ్ కంపెనీలు, ఎఫ్‌బిఓలు, ర్యాంపులు, ట్రేడర్ల వద్ద తోతాపురి మామిడిని అమ్మినవారికి మద్దతు ధర అందేలా చర్యలు చేపట్టాలన్నారు. షిఫ్టులు వారీగా ప్రతి ప్రాసెసింగ్ కంపెనీ వద్ద ఇద్దరి ఇన్చార్జిలను నియామకం చేయడం జరుగుతుందని అందులో ఒకరు కచ్చితంగా ఆర్ఎస్‌కే ఇంచార్జ్ ఉంటారని మీరు ప్రాసెసింగ్ కంపెనీ వద్దకు మామిడి వచ్చిన వెంటనే అది తోతాపురి రకమా కాదా అనేది పరిశీలించాలన్నారు. వివరాలు ప్రాసెసింగ్ కంపెనీల వారు కూడా నమోదు చేయడం జరుగుతుందని ఈ రెండిటిని సరిపోవాలన్నారు. తోతాపురి మామిడి మద్దతు ధరకు సంబంధించిన బోర్డును ప్రదర్శించాలని ప్రాసెసింగ్ కంపెనీల వారు ఇచ్చే మొత్తంలో ప్రాసెసింగ్ కంపెనీలు 8 రూపాయలు ఇవ్వగా రూ.4 రాష్ట్ర ప్రభుత్వం తరవున ప్రోత్సాహకంగా అందివ్వడం జరుగుతుందనే విషయాన్ని బోర్డులో ప్రదర్శించాలన్నారు. తోతాపురి మామిడికి మద్దతు ధర అందించే విషయంలో పర్యవేక్షణ బాధ్యతలు నిర్వహించే ప్రతి అధికారి సిబ్బంది ఈ అంశంపై పూర్తి అవగాహన పెంచుకోవాలని వారి కేటాయించిన విధులను బాధ్యతాయుతంగా నిర్వర్తించాలని ఆదేశించారు. కార్యక్రమంలో చిత్తూరు ఆర్డీవో శ్రీనివాసులు, తహశీల్దార్లు, డిప్యూటీ తహశీల్దారులు, ఉద్యాన శాఖ అధికారులు, రైతు సేవ కేంద్రం అధికారులు, రెవెన్యూ శాఖ అధికారులు పాల్గొన్నారు.

పిహెచ్‌సిలో అన్నదానం

ప్రజాశక్తి- గంగాధర నెల్లూరు: మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పిఎంఎస్ఎం కార్యక్రమం సందర్భంగా సోమవారం రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో రోగులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులకు ఆకలితో ఉండకూడదని ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ముఖ్యంగా వైద్యపరీక్షల కోసం వచ్చే గర్భిణులు, రోగులకు అన్నదానం నిర్వహిస్తున్నమని రెడ్ క్రాస్ మండల చైర్మన్ పాపిరెడ్డి అన్నారు. ఈ కార్యక్రమానికి సహాయ సహకారాలు అందించిన డాక్టర్లు గురుప్రకాష్, ప్రవీన్, హెల్త్ డిపార్ట్మెంట్ సిబ్బంది కృతజ్ఞతలు తెలియజేశారు. సిహెచ్ఓ శ్రీనివాసులు, రెడ్ క్రాస్ మండల ప్రెసిడెంట్ పాపిరెడ్డి పాల్గొన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రధానమంత్రి సురక్ష మాతృ అభియాన్ కార్యక్రమంను సోమవారం నిర్వహించారు. పిహెచ్‌సి డాక్టర్ విజయచంద్ర, సిబ్బంది గర్భిణులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులను అందించారు. అనంతరం మండల కేంద్రంలోని మహతి ఫౌండేషన్ చైర్మన్ నాగరాజు సహకారంతో గర్భిణీలకు పౌష్టికాహారం ఉచితంగా అందజేశారు. డాక్టర్ విజయచంద్ర మాట్లాడుతూ గర్భవతులు ప్రతినెలా రక్త పరీక్షలు చేయించుకోవాలని, వైద్యుల సలహాలు పాటించాలని, పోషకాహారం తింటూ వ్యక్తిగత శుభ్రత పాటించాలని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ శాలిని, హెల్త్ ఎడ్యుకేటర్ సావిత్రి, మహతి ఫౌండేషన్ సహాయక మేనేజర్ శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు

నడి రోడ్డులో రాతి కూసాలు..

ప్రజాశక్తి- వెదురుకుప్పం: మండలంలోని ముత్రాలం కాలనీకి వెళ్లే దారిలో ఓ నాయకుడు రాతి కుసాలను నడిరోడ్డులో నాటేశాడు. అధికారం ఉందనో లేక ఏమి చేసినా అడగరనేమో కానీ నాలుగు గ్రామాల ప్రజలు వెళ్లే రోడ్డుపై రాతి కూసాలు నాటి అక్రమణకు పాల్పడుతున్నారు. ఇంత జరుగుతున్నా ఇటు ఫారెస్ట్ అటు రెవెన్యూ అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని స్థానిక ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్రజల సమస్యను అధికారులు పట్టించుకోరా అని గ్రామస్తులు అధికారుల తీరుపై విమర్శలు చేస్తున్నారు.

వేరుశనగ విత్తనాలు పంపిణీ

ప్రజాశక్తి- గంగాధర నెల్లూరు: మండలంలోని తూగుండ్రం రైతు సేవా కేంద్రంలో సోమవారం వేరుశనగ విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. రైతులకు టిడిపి నాయకులు, అగ్రికల్చర్ ఏఈఓ కుసుమ సంయుక్తంగా వేరుశనగ విత్తనాలను అందజేశారు. సబ్సిడీతో రైతులకు అందిస్తున్న వేరుశనగ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నియోజకవర్గ ముస్లిం మైనారిటీ ప్రధాన కార్యదర్శి, నియాజ్ అలీ, టిఎన్‌టియుసి అధికార ప్రతినిధి జీవరత్నం, నరసింహులు నాయుడు, రాఘవేంద్ర, శ్రీనివాసులు శెట్టి, అతేహర్ అలీ పాల్గొన్నారు.

కౌలు రైతులకు రుణాలు ఇవ్వాలి

ప్రజాశక్తి- పలమనేరు: ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, కౌలు రైతు సంఘం తరపున అన్నదాత సుఖీభవ అమలు చేయాలని, కౌలు రైతులకు సైతం వర్తింపజేయాలని, రూ.5లక్షలు వరకు రుణ పరిమితి పెంచాలని, ఎలాంటి షరతులు లేకుండా రైతులకు రూ.2 లక్షల రుణాలు మంజూరు చేయాలని కోరుతూ సోమవారం చిత్తూరు కలెక్టర్ కార్యాలయంలో జెసి విద్యాధరికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు, కార్యదర్శులు డాక్టర్ టి.జనార్ధన, కె.మునిరత్నం నాయుడు, నాయకులు ఉమాపతి నాయుడు, మోహన్ రెడ్డి, భక్తవత్సల రెడ్డి పాల్గొన్నారు.

ఖరీఫ్ పంటపై అవగాహన

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: మండలంలోని బేలుపల్లి పంచాయతీ పరిధిలో ఉన్న రైతులకు ఖరీఫ్ పంటపై అవగాహన సదస్సు సోమవారం వికసిత్ కృషి సంకల్ప అభయా కార్యక్రమం నిర్వహించారు. కెవికె కలికిరి సమన్వయకర్త డాక్టర్ కె.మంజుల మాట్లాడుతూ వేరుశనగలు రకాలైన విశిష్ట నిత్య హరిత మంచు వారిలో టెక్నాలజీ అల్పన డ్రోన్ గురించి వివరించారు. జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ సహాయక సంచాలకులు నాగపద్మనీ మాట్లాడుతూ వివిధ పంటల్లో సమగ్ర పోషక యజమాన్యం గురించి తెలిపారు. పచ్చ రొట్టి పంటలు వేయడం, జీవన ఎరువులు వాడడం రసాయనిక ఎరువులతో సమగ్ర పోషక యాజమాన్యంతో భవిష్య తరాల్లో రైతులకు నాణ్యతగా పండించే భూమి చేకూరుతుందన్నారు. వెటర్నరీ డాక్టర్ వెంకట సాయి మాట్లాడుతూ పాడి పశువులకు పశు బీమా పథకం ఇతర పథకాల గురించి వివరించారు. అలాగే ఆవుల్లో పొదుగు వాపు వ్యాధి పులిపుర్లు నివారణ చర్యలు, గర్భం దాల్చిన ఆవులు ఏ విధంగా చూసుకోవాలో పాడు రైతులకు వివరించారు.

విజన్ యాక్షన్ ప్లాన్‌పై టెలి కాన్ఫరెన్స్

- **హాజరైన ఎమ్మెల్యేలు**

ప్రజాశక్తి- గంగాధర నెల్లూరు: మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో సీఎం చంద్రబాబు నాయుడు టెలి కాన్ఫరెన్స్‌కు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే డాక్టర్ థామస్ సోమవారం హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి టెలికాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించిన స్వర్ణాంధ్ర- 2047 విజన్ యాక్షన్ ప్లాన్ సమావేశంలో నియోజకవర్గంలోని అధికారులతో ఎమ్మెల్యే పాల్గొని ముఖ్యమంత్రి ఇచ్చిన సందేశాన్ని విన్నారు. చీఫ్ ప్లానింగ్ అధికారి సాంబశివారెడ్డి, ఎంపీడీవో సతీష్, ఎంపీడీవోలు, అధికారులు పాల్గొన్నారు. అనంతరం మండలం సమీపంలో గల 100 గొల్లపల్లి జైన్ ఫ్యాక్టరీలో సీనియర్ మేనేజర్ దిలీప్ మామిడి కొనుగోలుపై ఎమ్మెల్యేతో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తోతాపూరి టన్నుకు రూ.12వేలు లెక్కన రైతులకు ధర నిర్ణయించారని తెలిపారు. ఇందులో ప్రభుత్వం తరపున రూ.4వేలు, ఫ్యాక్టరీ తరపున రూ.8వేలు నగదును రైతుకు ఇవ్వనున్నట్లు తెలిపారు. మామిడి రైతులు ఫ్యాక్టరీలకు 10 తేదీ మంగళవారం నుండి సరఫరా చేయవచ్చు అని తెలిపారు. టిడిపి నాయకులు కృష్ణమ నాయుడు, శ్రీధర్ యాదవ్, స్వామిదాస్, హరీష్ యాదవ్, కోదండ రెడ్డి, మోహన్ నాయుడు, బాబు నాయుడు, జ్యోతి యాదవ్, జీవరత్నం పాల్గొన్నారు.

పలమనేరు: పలమనేరు మున్సిపల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్వర్ణాంధ్ర - 2047లో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు టెలికాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించిన నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లాన్ సమావేశానికి పలమనేరు శాసన సభ్యులు ఎన్. అమరనాథ రెడ్డి హాజరయ్యారు. టెలి కాన్ఫరెన్స్ అనంతరం నియోజకవర్గంలో జరుగుతున్న పనులు, చేపట్టాల్సిన కార్యక్రమాలపై ఎమ్మెల్యే అధికారులతో చర్చించారు. ఈ సమావేశంలో నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్ శ్రీదేవి, ఆర్‌డీవో భవాని, డీఎస్పీ ప్రభాకర్, ఎఫ్ఆర్వో నారాయణ, మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి, సీఐ నరసింహరాజు, తహసీల్దార్‌లు ఇన్బ నాథన్, అనిల్ కుమార్, ప్రసన్న కుమార్, ఎంపీడీఓలు బాలాజీ, భాస్కర్, సురేష్ బాబు, ఈశ్వరన్, రాజేంద్ర బాలాజీ పాల్గొన్నారు.

జీడీ నెల్లూరులో ఎమ్మెల్యే థామస్

పలమనేరులో ఎమ్మెల్యే అమరనాథ్ రెడ్డి

ఎంసెట్లో పిఎస్ఎన్ శ్రీ వివాకానంద జిల్లా ఫస్ట్ ర్యాంక్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: సోమవారం విడుదల చేసిన ఎంసెట్ పరీక్ష ఫలితాల్లో చిత్తూరు మురుగానుపల్లిలో గల పిఎస్ఎన్ శ్రీ వివేకానంద జూనియర్ కళాశాల విద్యార్థిని సాహితి జిల్లా మొదటి ర్యాంకు సాధించినట్లు కళాశాల కరస్పాండెంట్ సత్యనారాయణ, ప్రిన్సిపాల్ నాగరాజు శెట్టి తెలిపారు. తమ కళాశాల విద్యార్థులు ఎంసెట్ పరీక్ష ఫలితాల్లో ఉత్తమ ర్యాంకులు సాధించారని తేజరెడ్డి 1648, గణేష్ 2736, అనీష్ 3559, మన్యత 3636, పవన్ కళ్యాణ్ 5022, లికిత 5214, దిలీప్ 5461, మహిత కీర్తి 6178, తేజస్ 6966, స్నేహ 7159 ర్యాంకులు సాధించగా మరో 12 మంది విద్యార్థులు ఎంసెట్ పరీక్ష ఫలితాల్లో ఉత్తమ ర్యాంకులు సాధించారని తెలిపారు. తమ కళాశాల విద్యార్థులు 23 మంది ఉత్తమ ర్యాంకులు సాధించి తమ కళాశాల ఖ్యాతిని పెంచారని పేర్కొన్నారు. ఎంసెట్ పరీక్ష ఫలితాల్లో ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థినీ విద్యార్థులను ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషి చేసిన అధ్యాపకులను కళాశాల కరస్పాండెంట్, ప్రిన్సిపాల్ అభినందించారు.

ఎంసెట్ ఫలితాల్లో శ్రీ వివేకానంద టౌన్ టాపర్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: సోమవారం విడుదలైన ఎంసెట్ పరీక్ష ఫలితాల్లో చిత్తూరు నగరంలోని మురుగానుపల్లి నందుగల శ్రీ వివేకానంద జూనియర్ కళాశాల విద్యార్థి టౌన్ టాపర్గా నిలిచారని శ్రీ వివేకానంద జూనియర్ కళాశాల కరస్పాండెంట్లు మహేంద్ర కుమార్, భాస్కర్ నాయుడు తెలిపారు. ఎంసెట్ పరీక్ష ఫలితాల్లో తమ కళాశాల విద్యార్థులు తరుణ్ కుమార్ 2145, మహేశ్వర్ 4851, రాకేష్ 7126, బాలు 11373, శశాంక్ 16297, లోషన్ 18027 ర్యాంకులు సాధించారని అలాగే బైపిసి విభాగంలో గాయత్రి 8593, నిర్మల్ కుమార్ 10277, రుపీనా 20056, రాజ్ కుమార్ 22504, శైలు 23146, పల్లవి 24362 ర్యాంకులు సాధించినట్లు తెలిపారు. ఎంసెట్ పరీక్ష ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులు ఎందుకు కృషి చేసిన అధ్యాపకులను శ్రీ వివేకానంద జూనియర్ కళాశాల కరస్పాండెంట్లు మహేంద్ర కుమార్, భాస్కర్ నాయుడు అభినందించారు.

ఫీల్డ్ అసిస్టెంట్ ఆత్మహత్యాయత్నం..

ఫీల్డ్‌అసిస్టెంట్ ఆత్మహత్యను చాకచక్యంగా పరిష్కరించిన తహశీల్దార్
ఫలించిన పోలీసుల సహకారం, రెవెన్యూ వారి పాచిక
జిల్లా కలెక్టర్ దగ్గరకు ఫీల్ అసిస్టెంట్ కుటుంబం

ప్రజాశక్తి -ఎస్ఆర్ పురం : మండలంలో ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ ఉద్యోగం నుంచి తొలగించారని మనస్తాపం చెంది ఆత్మహత్య ప్రయత్నానికి పాల్పడ్డాడు. స్థానిక తహశీల్దార్ లౌక్యంగా వ్యవహరించి ఆ వ్యక్తిని ఆత్మహత్య ప్రయత్నం చేసుకోకుండా ఆపే ఆ ప్రయత్నం చేశారు. ఆ కుటుంబాన్ని మండల పోలీస్ సహకారంతో జిల్లా పరిపాలన అధికారి ముందు హాజరు పరిచారు.

బాధితులు తెలిపిన మేరకు.. గంగాధర నెల్లూరు నియోజకవర్గ ఎస్ఆర్ పురం మండలంలోని ఎగువ కమ్మకండిగా పంచాయతీ చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటేష్ సోమవారం మండల కేంద్రంలోని తాగునీటి ట్యాంక్ పైకి విషం బాటిల్‌తో వెళ్లి ఆత్మహత్య చేసుకుంటానని, తన మరణానికి కారణం ఎంపీడీవో అని ఆత్మహత్య ప్రయత్నం చేయడంతో ఒక్కసారిగా మండల కేంద్రంలో అలజడి ప్రారంభమైంది. తహశీల్దార్ లోకనాథ పిళ్ళై, ఎంపీడీవో మోహన్ మురళి పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. ఫీల్డ్ అసిస్టెంట్ భార్య కింద నుంచి ఎంపీడీవోపై తన భర్త చావుకు నీవే కారణం అంటూ వాగ్వాదానికి దిగారు. కాగా ఈ ఫీల్డ్ అసిస్టెంట్ అవినీతి ఆరోపణలతో ఇతన్ని గతంలో సస్పెండ్ చేశారు. ఈ ఏడాది మే 13వ తేదీన కలెక్టర్ నుంచి ప్రత్యేక ఉత్తర్వులు తెచ్చుకొని విధుల్లో జాయిన్ అయ్యారు. అయితే గ్రామస్తులు ఇతను అవినీతిపరుడని వ్యతిరేకించడంతో జూన్ 5న ఇతన్ని శాశ్వతంగా విధుల నుంచి తొలగిస్తూ కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. దీంతో మనస్థాపం చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ సోమవారం ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. తహసిల్దార్ ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి కలెక్టర్‌తో మాట్లాడి న్యాయం చేస్తానని హామీ ఇవ్వడంతో ఫీల్డ్ అసిస్టెంట్ ట్యాంక్ నుంచి కిందికి దిగాడు.. మధ్యాహ్నం ఫీల్డ్ అసిస్టెంట్‌ను అతని భార్యను తహశీల్దార్ కలెక్టరు దగ్గరికి తీసుకెళ్లాడు. తన తొలగింపుకు ఎంపీడీవో కారణమని అవినీతికి పాల్పడలేదని ఫీల్డ్ అసిస్టెంట్, అతని భార్య కలెక్టర్‌కి చెప్పడంతో దీనిపై మరొక తేదీన విచారణ జరిపిస్తామని దీనికి సంబంధించిన రికార్డులను పీడీ ద్వారా తెప్పించుకొని అధికారులు ఫీల్డ్ అసిస్టెంట్ సంవత్సరంలో పూర్తిస్థాయిలో విచారణ జరిపి న్యాయం చేస్తామని కలెక్టర్ హామీ ఇవ్వడంతో ఫీల్డ్ అసిస్టెంట్ ఆయన భార్య ఇంటికి చేరారు.

అధికారుల ఉత్తర్వుల మేరకే అతన్ని విధుల నుంచి తొలగించాం :ఎంపీడీవో

బినామీ పేర్లతో మాస్టర్లు వేసి, డబ్బులు తీసుకున్నట్లు విచారణలు తేలిందని, ఫీల్డ్ అసిస్టెంట్ తన విధులను నిర్లక్ష్యం చేయడం, కూలీలకు పని డిమాండ్లు నమోదు చేయడంలో విఫలమయ్యారని తెలిపారు. క్షేత్ర సహాయకులు ఉపాధి శ్రామికులు పని కల్పించమని కోరగా అవమానిస్తూ అసభ్యకరంగా దూషిస్తూ ప్రవర్తిస్తున్నారు. అతనిపై మోపబడిన అభియోగాలు అన్ని వాస్తవమని విచారణలో నిర్ధారించి విధుల నుండి తొలగించుతూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారని తెలిపారు.

క్రైం న్యూస్

రోడ్డు ప్రమాదంలో రైతు మృతి

ప్రజాశక్తి- విజయపురం (నగరి): రోడ్డు ప్రమాదంలో బాలాజీ (39) అనే రైతు మృతి చెందిన సంఘటన మండలంలోని బుగ్గఅగ్రహారం వద్ద సోమవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. తిరుపతి జిల్లా, నారాయణవనం మండలం దక్షిణ పాలమంగళంకు చెందిన బాలాజీ వ్యవసాయం చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. సోమవారం రాష్ట్ర సరిహద్దు తమిళనాడుకు చెందిన పుణ్యంకు వెళ్లి తిరుగు ప్రయాణంలో పాలమంగళంకు నాగలాపురం రోడ్డులో ద్విచక్రవాహనంపై వెళుతుండగా బుగ్గ అగ్రహారం వద్ద ఎదురుగా వచ్చిన ట్రాక్టర్ ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలపాలైన బాలాజీ అక్కడికక్కడే మృతిచెందాడు. ట్రాక్టర్‌ను, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఎస్ఐ విజయ్‌నాయక్ కేసు నమోదుచేశారు.

ఫిట్‌నెస్ సర్టిఫికేట్ లేకుంటే కఠిన చర్యలు

ప్రజాశక్తి- విజయపురం (నగరి): ప్రతి స్కూల్, కాలేజీబస్సులకు ఫిట్‌నెస్ సర్టిఫికేట్ తప్పనిసరిగా ఉండాలని లేకుంటే చర్యలు తప్పవని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ వాసుదేవరెడ్డి హెచ్చరికలు జారీ చేశారు. ఈనెల 12వ తేదీ నుంచి పాఠశాలలు, కళాశాలలు ప్రారంభం కానుండటంతో ఆయన పాఠశాల, కళాశాలల బస్సులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలకు చెందినవి 25 బస్సులు ఉన్నాయని ఇప్పటివరకు 12 బస్సులు మాత్రమే ఫిట్‌నెస్ సర్టిఫికేట్ పొందాయన్నారు. మిగిలిన బస్సులు కూడా ఈ నెల 15వ తేదీ లోపు ఫిట్‌నెస్ సర్టిఫికేట్ పొందాలన్నారు. సర్టిఫికేట్ లేకుండా బస్సులు విద్యార్థులను తీసుకెళితే వాటిని సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించడంతో పాటు ఆ పాఠశాలల యాజమాన్యంపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకుంటా మన్నారు. ఇచ్చిన గడువులోపు సర్టిఫికేట్ పొందాలన్నారు.

వాహనాల రికార్డులు కలిగి ఉండాలి: సిఐ

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: వాహనాలకు రికార్డులు కలిగి ఉండాలని సీఐ శ్రీనివాసులు తెలిపారు. సోమవారం రోడ్డు ప్రమాదాల నివారణ చర్యల్లో భాగంగా మండల కేంద్రంలోని మామిడికాయల మండిలో ట్రాక్టర్ డ్రైవర్స్‌తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రతి వాహానానికి రికార్డులు, ప్రతి ఒక్కరు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్సు, వాహానానికి ఫిట్నెస్ సర్టిఫికెట్, ఇన్సూరెన్సు ఉండాలని సూచించారు. అతి వేగంగా వాహనాలను నడప రాదని, ఓవర్ లోడ్ ఉండరాదని తెలిపారు. మైనర్లకి వాహనాలు ఇవ్వకూడదని, వాహనాలకు రేడియం స్టిక్కర్లు అమర్చాలని వీటిని పాటిస్తే ప్రమాదాల నుండి నివారించవచ్చని అన్నారు. ఎస్సై ప్రసాద్, ఏఎస్ఐ మల్లప్ప, హెడ్ కానిస్టేబుల్ సారధి, కానిస్టేబుల్ రమేష్, ద్వారక, ట్రాక్టర్ డ్రైవర్లు పాల్గొన్నారు.

తూకంలో తేడాలు రాకూడదు

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: తూకంలో తేడాలు రాకూడదని తిరుపతి లీగల్ మెట్రాలజీ అధికారి స్వామిశ్రీ అన్నారు. సోమవారం మండలం కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్లో గల తూనికలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం తూనికల కొలతలను నిర్ధారిస్తుందని నిర్ధారించినప్పుడు ప్రభుత్వం నుండి తగిన రసీదులు తీసుకోవాలన్నారు. తూనికల అధికారులు పరిశీలల్లో అవకతవకలు గుర్తిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ డిఎస్ఓ శేఖర్ తదితరులు పాల్గొన్నారు

రోడ్డు సౌకర్యం కల్పించండి

ప్రజాశక్తి- గుడిపాల: గుడిపాల మండలం ఒంటిల్లుకి చెందిన గ్రామస్తులు తమ గ్రామానికి ఎటువంటి రోడ్డు మార్గం లేదని రోడ్డు సౌకర్యం కల్పించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ విద్యాధరిని సోమవారం విన్నవించారు. గ్రామస్తులు మాట్లాడుతూ బెంగళూరు-చెన్నై హైవే తమ గ్రామంపై నుంచి వెళ్తున్నదనీ, విలేజ్ టర్న్ ఆక్టివిటీ రోడ్ ఈ ఎక్స్ప్రెస్ హైవే వల్లన కోల్పోయిందనీ హైవే సర్వే చేసేటప్పుడు దారి చూపిస్తామని చెప్పారు కానీ తమ ఊరికి కనెక్టివిటీ రోడ్డు లేకుండా చేసేశారనీ వాపోయారు. ఊరికి దారి సమస్య పరిష్కరించగలరని జాయింట్ కలెక్టర్‌ను కోరారు. జెసి వెంటనే పరిశీలించి చర్యలు తీసుకోవాలని గుడిపాల తహశీల్దార్ జయంతి, జిల్లా రవాణా శాఖ అధికారిని, ఆర్ అండ్ బి అధికారులను ఆదేశించారు.

IN THE COURT OF THE Principal Senior Civil Judge, Chittoor
H.M.O.P.No.217 / 2024

S.K.Sagarika ...Petitioner
V/s
V.S.Naveen ...Respondent

Notice to Respondent under order V Rule 20 Red with Section 151 of CPC

V.S.Naveen S/o Surendra Naidu, R/o D.No.7-29, Kaminayanipalli, Y.S.Gate, Yellampalle, Santhagate, Iral Mandalam, Chittoor District, Ap-517130, Cell: 8967776669

Pleace take notice that S.K.Sagarika Filed HMOP: 217/2024 against you for seeking divorce the above matter posted on 26.06.2025 for your appearance hence please be Present on 26.06.2025 at about 10.30 am before Honorable Court chittoor either Party in person or through your councel filing which the matter will be desided in your absent and treated on you exparty

by order of Court
T.SESHADRI
Advocate, Tirupati. Cell: 9505260075